# నగ్న శిఖరాలు

'ఎయిర్ బస్' మెల్లగా 'రన్‌వే' మీద దిగుతోంది.

గులాబీదండలు పుచ్చుకొని నిలబడ్డ ఉషాగాయత్రి, కిరీటి, పార్థసారధి మొహాల్లో ఒక్కమాటుగా ఉద్వేగం పెరిగింది.

"ప్లేన్ వచ్చేస్తోంది. మన జయరాం ఇంకా ఊడిపడడేం?" విసుక్కున్నాడు. పార్థసారధి.

"మనవాడికిది మామూలేగా– ఎక్కడి కెళితే అక్కడే!" వ్యంగ్యంగా అన్నాడు కిరీటి.

"ఇంతకీ మన ఎమ్.డి.గారి కారుని విమానందాకా తీసుకొళ్లేందుకు ఎయిర్ పోర్టు అథారిటీ ఒప్పుకొన్నారో లేదో..." సందేహంగా అంది ఉష.

"ఆ సందేహం అక్కర్లేదులే, మన వాడు పట్టుకున్నాడంటే మొసలే" కిరీటి.

"ప్లేన్ టార్ మెక్ మీదకొచ్చేస్తోంది" అన్నాడు పార్థసారధి ఆదుర్దాగా.

అతనా మాటలు అంటుండగానే 'ఎయిర్ బస్' చెవులు హోరెత్తేలా ఇంజిన్లు రొదచేసుకుంటూ 'టార్‌మెక్' మీద కొచ్చేసింది.

గ్రౌండ్ మార్షలర్, ఎయిర్‌బస్ పైలట్‌కి సంకేతాల ద్వారా పొజిషన్ చూపిస్తున్నాడు.

అప్పుడు పరుగులు తీస్తూ వచ్చాడు జయరాం.

"కమాన్ క్విక్" అంటూనే కారు వైపు పరుగెత్తాడు.

మనసులో విసుక్కుంటూనే అతని వెంట పరుగెత్తుకెళ్లి కార్లో కూర్చున్నారు. జపాన్ మేక్ ఎయిర్‌కండిషన్ కారు చిన్న కుదుపుతో ముందుకి కదిలి. పాదరసంలాగా జారుతూ నేరుగా వెళ్లి 'ఎయిర్ బస్'కు సమీపంగా నిలబడింది.

అప్పుడే కిషోర్ ఎడమచేతిమీద కోటు వేసుకుని బయటికొచ్చాడు.

వెంటనే హర్షధ్వానాలు.

కిషోర్ జవాబుగా జయరాం బృందాన్ని నవ్వుమొహంతో చూసి, గాలిలో అభినందన సూచకంగా చెయ్యి కదిలించాడు.

ఒక్కో మెట్టూ దిగి, కారు దగ్గరికి రాగానే గులాబీదండలతో ముంచెత్తారు.

"థాంక్యూ వెరీమచ్" దండలు తీసి, కారులోకెక్కి కూర్చున్నాడు, కిషోర్. అతని ఆదేశంమీద పక్కనే ఉషాగాయత్రి ఆసీనురాలైంది.

"టికెట్ ఇలా ఇవ్వండి సార్– ఫార్మాలిటిస్ కంప్లీట్ చేయిస్తాను"

జయరాం ఇచ్చాడు.

కారు రాయంచలా వయ్యారంగా ముందుకు కదిలింది.

◆ ◆ ◆

"మే ఐ కమిన్ సర్?"

"యస్"

"సారీ ఫర్ ది డిలే"

"టేక్ యువర్ సీట్"

"థ్యాంక్యూ సర్"

కిషోర్ ఓ మాటు అందరికేసి చూశాడు.

అంతా ఉన్నారు!

"సో ఐ విల్ బిగిన్..." సౌండ్ ప్రూఫ్ ఏసీ గదిలో నిశ్శబ్దం మరో మాటూ భంగమైంది.

తెరుచుకున్న తలుపులోంచి లోపలికొచ్చిన ప్యూను జార్జి చేతిలో క్రీమ్ బిస్కెట్ ప్యాకెట్లున్నాయి. పేపరు ప్లేట్లలోకి వాటిని సర్ది, అందరిముందూ ఉంచి, మంచినీళ్ల గ్లాసులు అమర్చాడు.మౌనంగా, కళ్లతోనే కిషోర్ అనుమతి తీసుకుని బయటికి వెళ్లిపోయాడు.

"ఏం చేద్దాం? కానివ్వండి. ఎదురుగా క్రీమ్ బిస్కెట్లుంటే, నా ఉపన్యాసం రుచి చెడిపోయే ప్రమాదం ఉంది" నవ్వుతూ ఒక బిస్కెట్ అందుకున్నాడు కిషోర్.

మిగతావాళ్లు కూడా అతన్ననుసరించారు.

చలోక్తులు- బిస్కెట్ల తియ్యదనం, మంచినీళ్ళ చల్లదనం మధ్య పది నిమిషాలు దొర్లాయి.

పదకొండో నిమిషంలో కిషోర్ ఉపన్యాసం ఇవ్వటానికి సిద్ధమయ్యాడు. మళ్లీ డోరు తెరుచుకుంది.

మేనకలా 'మేకప్' చేసుకున్న ఉషాగాయత్రి నవ్వుమొహం!

"యస్ ఉషా..."

"మీ కోసం ఎవరో వచ్చారు సార్..."

"అఫీషియల్?"

"పర్సనల్!"

"అగమని చెప్పు"

"ఓ.కే సర్" వెళ్లిపోయింది. ఇక కిషోర్ అగలేదు.

అతని విదేశీ పర్యటనా విశేషాలు. కంపెనీ అభివృద్ధికి చేయవలసిన మార్పులు, మానేజిమెంట్‌లో సరికొత్త విధానాలు... ఇలా గంటసేపు కొనసాగింది ఉపన్యాసం.

కిరీటి, పార్థసారధి, జయరాం, మరి కొందరు ముఖ్యమయిన ఆఫీసర్లు- అతని ఉపన్యాసాన్ని చివరిదాకా శ్రద్ధగా విన్నారు.

అతను ముగించగానే హర్షాధ్వానాలు మోగాయి.

"ఇప్పుడు మీ సమస్యలు ఏవైనాఉంటే చెప్పండి..." కుషన్ చెయిర్‌లో వెనక్కివాలి,

రిలీఫ్‌గా చూస్తూ అన్నాడు కిషోర్.

తలా ఒకటి చెప్పారు.

అందులో కొన్ని ఆఫీసుకి, మరి కొన్ని వ్యక్తిగతానికి సంబంధించినవి.

ప్రతిదానికీ, వాళ్లు సంతృప్తిపడేలా పరిష్కారాలు సూచించాడు. వ్యక్తిగత సమస్యల్లో కంపెనీ తరఫున అసాధారణమైన ఉదారత చూపించటం అందరికీ ఆనందం కలిగించింది.

కంపెనీ మానేజింగ్ డైరెక్టరుగా అతనిపట్ల వారికిగల గౌరవాన్ని అతని ఉదారత్వం, ఔన్నత్యం ద్విగుణీకృతం చేశాయి. ఎక్కడి వాళ్లక్కడకు వెళ్లిపోయాక, ఏవో ఫైల్సు చూసుకుంటూ అక్కడే కూర్చుండిపోయాడు కిషోర్.

కొద్ది నిమిషాలు ఏకాంతంలో గంభీరంగా దొర్లాక మళ్లీ తలుపు తెరిచిన శబ్దం.

చివ్వున తలెత్తిచూశాడు.

ఉషాగాయత్రి.

"అతన్ని లోపలికి పంపించమంటారా సార్?"

కిషోర్‌కి చప్పున గుర్తువచ్చింది. తనకోసం ఎవరో చాలాసేపుగా నిరీక్షిస్తున్నారని. ఆ సంగతే మరిచిపోయేడతను. లేకపోతే, మీటింగు పూర్తయిన వెంటనే పిలిపించి ఉండేవాడు!

తన మతిమరుపుకి మనసులో నొచ్చుకుంటూ "ప్లీజ్...." అన్నాడు.

ఉషాగాయత్రి అతణ్ని పంపించటానికి వెళ్లింది.

మరోనిమిషం గడిచేలోగానే తలుపు తెరుచుకుంది. లోపలికి వచ్చిన వ్యక్తిని వెంటనే గుర్తుపట్టలేక అలాగే చూస్తుండిపోయాడు కిషోర్.

"నేను రఘుని"

కిషోర్ మాటలు రానివాడిలా అలాగే చూస్తుండిపోయాడు.

"నన్ను గుర్తుపట్టలేదనుకుంటాను.."

"లేదు.."

నవ్వేడతను, "చాలాకాలం అయింది కద... నేను నీకు సవితి తమ్ముణ్ని..." పరిచయం చేసుకున్నాడు.

ఒక్కమాటు నాలుగువేల వోల్టుల షాక్ తిన్నట్లు అదిరిపడ్డాడు.

'సవితి తమ్ముడు..' తనలో తను గొణుక్కున్నాడు.

ఎప్పుడో చిన్నతనంలో చూశాడు.. ఇంత పెద్దవాడిగా ఇదే చూడటం. తననెలా గుర్తుపట్టాడో.. కనుక్కుని ఉంటాడు. మెల్లగా వివరాలు సేకరించి ఉంటాడు!

"ఏమిటలా అయిపోయావ్?"

తేరుకున్నాడు.

"ఏమీలేదు! ఇప్పుడు నువ్వెందు కొచ్చావ్?" లోలోపల చల్లారిన అగ్నిపర్వతం మళ్లీ రగులుకుంటున్నట్లు బాధ, ఆవేశం పొంగుతున్నాయి.

"పంటలు దెబ్బతిన్నాయి, నాన్నకి పక్షవాతం. అమ్మకి టి.బి. ఆర్థిక పరిస్థితి బాగాలేక. తమ్ముళ్లు చదువు మానేసి తలొక పనిలో చేరారు..."

"ఇవన్నీ చెప్పినందువల్ల ఉపయోగం ఏమిటి?"

"నీ దగ్గర ఏదైనా ఉద్యోగం..."

వ్యంగ్యంగా నవ్వాడు... "బయట బోర్డు చూళ్లేదా? నో వేకెన్సీ అని పెద్ద అక్షరాలతో ఉంటుందే... బైదిబై...నువ్వేం చదువుకున్నావ్?"

"ప్రైవేటుగా ఎమ్మే ఫస్టుక్లాసుతో ప్యాసయ్యాను"

"అయితే నే నివ్వగల ఉద్యోగం నువ్వు చెయ్యలేవు..." గాయపరచాలన్న కౌతుకం కళ్లలో కనిపించింది.

"ఏమిటది?"

"బంట్రోతు ఉద్యోగం" అతను మౌనంగా ఉండిపోయాడు. నిశ్శబ్దాన్ని భంగంచేస్తూ- "మీ అమ్మ నన్ను, నా చెల్లెల్నీ పరమరాక్షసంగా హింసించి ఇంట్లోంచి గెంటినప్పుడే మన సంబంధాలు తెగిపోయాయి. మీరు నాకు బంధువులవుతారని ఏనాడో మరిచిపోయాను. ఇంకా నీకు నామీద నమ్మకం ఉండటం నాకే ఆశ్చర్యంగా ఉంది. నేను గాంధీని, గౌతమబుద్ధుణ్ని కాదు, అందరూ అలా ఉండగలిగితే, మహాత్ముడికి విలువ, గుర్తింపు ఉండవు... సో... మీ గొడవేదో మీరు చూసుకోవటం మంచిది!"

రఘు నవ్వాడు.

"ఎందుకు నవ్వుతావ్?" కోపంగా అడిగాడు కిషోర్.

"దేవుణ్ని కొండశిఖరం మీద ప్రతిష్ఠిస్తారు. జీవితంలో ఔన్నత్యం అనే శిఖరాన్ని ఎక్కిన నీలో దైవత్వం చూడగలనని నమ్మాను, జీవితం గురించి నేను నీకు వేదాంతం చెప్పదలచుకోలేదు. కానీ ఒక్క సంగతి. మనం కొండశిఖరంమీద కూర్చున్నంత సేపూ నేలమీద మనుషులు చీమల్లా కుంచించుకుపోయి కనిపిస్తారు. అలా కనిపించటం భ్రమేనని మనం మరిచిపోకూడదు. అలా మరిచిపోకపోతే శిఖరంమీద పువ్వులా పరిమళిస్తాం. లేకపోతే, కురుపులా సమాజానికి బాధ కలిగిస్తాం. వస్తాను, గుడ్‌బై!" బాణంలా ముందుకు కదిలివెళ్లాడు రఘు.

ఎప్పుడు తలుపు తెరుచుకు మూసుకుందో కూడా కిషోర్‌కి తెలియదు. అంతరాంతరాల్లో మెరుపుకన్నా వేగంగా ప్రయాణించి, మస్తిష్కంలో గిర్రున గింగిరాలు కొట్టి, కర్ణరంధ్రాల్లో ప్రతిధ్వనులుగా మిగిలిపోయిన అతని మాటలు స్తబ్ధుణ్ని చేశాయి.

వివేకం వేకువలా రేకలు విచ్చుకుంది.

వెంటనే 'కాలింగ్ బజర్' నొక్కాడు.

ప్యూను జార్జి పరుగున వచ్చాడు.

"అతన్ని వెనక్కి పిలు..."

"ఎవర్ని సార్?"

"ఫూల్... ఇప్పుడు వెళ్లినతన్ని..." జార్జి హడావిడిగా పరుగుతీసాడు. నిముషం... రెండు... మూడు...నాలుగు... పది...పదిహేను...

అసహనంగా "కాలింగ్ బజర్" నొక్కాడు.

మళ్లీ- మళ్లీ- మళ్లీ...

ఎప్పటికో పగరుస్తూ వచ్చాడు జార్జి.

"సార్ సర్.... తాను వెనక్కిరానని ఈ కాయితం ఇచ్చాడు..."

కిషోర్ దాన్నందుకుని ఆశ్చర్యంగా విప్పదీసి చూశాడు.

దస్తూరి గజిబిజిగా ఉంది.

"డియర్ బ్రదర్-

స్వయంగా రావాలనిపించక ఈ ఉత్తరం పంపుతున్నాను. మనవంశంలో నువ్వొక్కడివే శిఖరంమీద దీపశిఖలా వెలిగిపోతున్నందుకు నాన్న ఎప్పుడూ గర్వపడుతుంటారు, ఆయన తోటి మేము కూడా.

కానీ, నిన్ను కలుసుకున్న తొలిక్షణాల్లో- ఆత్మీయత మరిచిపోయి, ఆగ్రహంతో, ఆవేశంతో మాట్లాడిన నిన్ను చూసి "ఇదా నేను ఊహించుకున్న మహోన్నతశిఖర నగ్నస్వరూపం" అని నివ్వెరపోయాను.

అందుకే నిన్ను చుట్టిముట్టిన భ్రమలు తొలగిపోవాలని పౌరుషంగా జవాబిచ్చాను. నా ఉద్దేశం ఫలించి నీలో ఈ మాత్రం కదలిక అయినా వచ్చినందుకు ఆనందపడుతున్నాను. నీలో నిజమైన పరివర్తన కలిగితే- అవతల నిన్ను కనీసం కళ్లతోనైనా చూసి తృప్తిపడదామని తపించే నీ రక్తబంధువుల్ని అనందపరచు.

నా సంగతి.

ఇప్పటికే "నో వేకెన్సీ" బోర్డులు చూసి చూసి విసిగిపోయాను. అలాంటి బాదరబందీలులేని డిపార్టుమెంటు మన రక్షణదళాలు మాత్రమే. అక్కడ సామర్థ్యం తప్ప. మరో అవసరం ఉండదు. ఎవర్నీ "దేహీ" అని దేనికీ యాచించనక్కరలేదు. అదే నాకు తగినచోటుగా నిర్ణయించుకున్నాను.

శలవ్....

- రఘు.

(యువ దీపావళి ప్రత్యేక సంచిక)